నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అల్వాల్ సబ్‌స్టేషన్ 11కేవీ భూపతిరావునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి12.30 వరకు భూపతిరావునగర్, శక్తిగణేష్‌నగర్, అల్వాల్‌హిల్స్ ప్రాంతాలు, 11కేవీ చంద్రాపురం కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు చంద్రాపురం కాలనీ, మంగాపురం కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌కు చెందిన అనుముల రాణి, అంజమ్మ, సంది కవిత, మాచర్ల నర్సమ్మలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం మాజీ కార్పొరేటర్ కుర్ర శాలినీశ్రీకాంత్‌గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు

కుషాయిగూడ: బీజేపీ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్ బుధవారం పారిశుద్ధ్య కార్మికుల మధ్య నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆయన చీరలు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లోని చిన్న జెండా బస్తీ రహదారి పక్కన విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో వీచే గాలివానలకు ఈ స్తంభం కిందపడి ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు చొరవతీసుకుని కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

అల్వాల్: అల్వాల్ సెక్టార్ యాప్రాల్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుధాకీర్తి ఆధ్వర్యంలో నూతనంగా చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం, పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సుధాకీర్తి మాట్లాడుతూ.. బిడ్డకు 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం మొదలుపెట్టాలని, బాలామృతం తినిపించాలన్నారు.

సైబర్‌క్రైమ్ బాధితులకు నగదు తిరిగి చెల్లింపు

అల్వాల్: నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్‌క్రైమ్ కేసుల్లో డబ్బులు పోగొట్టుకున్న 52 మంది బాధితులకు కోర్టు ద్వారా ప్రాసెస్ చేసి రూ.8,33,615ల నగదును తిరిగి చెల్లించారు. ఈ సందర్భంగా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మనీ రీఫండ్ ఆర్డర్ కాపీలను బాధితులకు అందజేశారు. భాగస్వాములైన హెడ్‌కానిస్టేబుల్ కాంతయ్య, కానిస్టేబుల్ రఘు, నాగలత, స్వప్నలను అభినందించారు.

ఉద్యోగ విరమణ

గౌతంనగర్: సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం రైల్ నిలయం బ్రాంచీ మజ్దూర్ యూనియన్ మాజీ వైస్ చైర్మన్, జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల సలహా సమితి సభ్యుడు నూర్ అహ్మద్‌అలీ ఆయనను కలిసి సత్కరించారు.

అధ్యాపక వృత్తి ఉన్నతమైనది

ఎంపీ ఈటల రాజేందర్



అభినందన సభలో ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: అధ్యాపక వృత్తి అన్నింటికంటే ఉన్నతమైనదని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని చిన్న కందిగూడ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వెంకటేశ్వర్‌రావు పదవీవిరమణ అభినందన సభకు ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల వారిని తీర్చిదిద్దే ఏకైక వృత్తి అధ్యాపకులేనన్నారు. పదవీవిరమణ తర్వాత ఆయన సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

తాగునీటికి కటకట !

కలుషిత జలాల సరఫరాతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

- నెలరోజులైనా లభించని పరిష్కారం
- స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న వైనం
- ట్యాంకర్లతోనైనా రక్షిత నీటిని అందించాలంటున్న మహిళలు



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కుషాయిగూడ : మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఎన్టీఆర్‌నగర్ కాలనీవాసులు నెలరోజులుగా తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నారు. నిత్యం నల్లాల్లో నీరు కలుషితమై వస్తుండటంతో ప్రజలు సతమతమవుతున్నారు. తాగడానికి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు.

గత్యంతర లేక అదే నీరు వినియోగం..

గత్యంతరం లేని పరిస్థితుల్లో కలుషిత మురుగునీటితోనే స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో తాగేందుకు ఆర్వో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ విషయంపై జలమండలి అధికారులతో పాటు స్థానిక కార్పొరేటర్‌కు విన్నవించుకోవడంతో మరమ్మతులు చేపట్టారు. కానీ సమస్య పరిష్కారం కాలేదంటున్నారు. నెలరోజులుగా మరమ్మతులు సాగుతున్నా.. ఇప్పటికీ సమస్యను గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ట్యాంకర్లతోనైనా తాగునీటిని అందించండి..

ట్యాంకర్లతోనైనా తాగేందుకు నీటిని అందించడం లేదని స్థానిక కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నెలరోజులుగా నరకయాతన అనుభవిస్తున్నాం



కలుషిత తాగునీటి సరఫరాతో నెలరోజులుగా నరకయాతన అనుభవిస్తున్నాం. నల్లాల్లోంచి వస్తున్న నీటికి దుర్వాసన వస్తోంది. గత్యంతరం లేక మురుగు నీటితోనే స్నానాలు చేస్తున్నాం. చర్మవ్యాధులతో పాటు చాలామంది జ్వరాల భారినపడ్డారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– సురేష్, కాలనీవాసి

ట్యాంకర్లతోనైనా తాగునీటిని అందించండి



తాగునీరు లేక నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. రోజూ ఆర్వో నీటిని కొనేందుకు రూ.20నుంచి 40 వెచ్చించాల్సి వస్తోంది. అధికారులు ట్యాంకర్లతోనైనా తాగునీటిని అందించాలన్న ఆలోచన అధికారులు, ప్రజా ప్రతినిధులకు రాకపోవడం బాధాకరం.

– సఫియా, ఐద్వా ప్రతినిధి

సమస్యకు పరిష్కారం లభించడం లేదు



ఎన్టీఆర్‌నగర్ కలుషిత తాగునీటి సరఫరా సమస్య నా దృష్టికి రాగానే జలమండలి అధికారులతో మాట్లాడాను. సమస్యకు పరిష్కారం చూపాలని కోరగా.. వారు వెంటనే మరమ్మతులు ప్రారంభించారు. కానీ సమస్య దొరకడం లేదు. కొంతమేర సమస్య తీరినప్పటికీ కెమెరాలు తెప్పించి సమస్యకు పూర్తి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించాను.

– ప్రభుదాస్, కార్పొరేటర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే ధ్యేయమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, నరసింహానగర్ కాలనీలో రూ.7.5లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ అభివృద్ధితో పాటు నియోజకవర్గం ప్రజల సంక్షేమానికి తన సహకారం అందజేస్తానన్నారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, ఏతం వేణుగోపాల్, అరుణ్, రంగు ప్రసాద్, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి



అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం వెస్ట్ శ్రీకృష్ణనగర్‌లో రూ.8 లక్షలతో వరదనీటి కాల్వ నిర్మాణ పనులు, భ్రమరాంబికానగర్‌లో రూ.35 లక్షలతో సీసీరోడ్డు పునర్నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు సాధ్యమవుతాయన్నారు. పెండింగ్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు కాలనీలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వచ్చేనెల 20, 21న మల్కాజిగిరిలో జరిగే బోనాల జాతర సందర్భంగా దేవాలయాలకు నిధులు మంజూరుకు దరఖాస్తులు అందజేయాలన్నారు. డీసీ రాజు, ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, మేనేజర్ నవీన్, ఏఈ నవీన్, ఎస్ఎస్ శ్రీనివాస్, వీఐ రమేష్ పాల్గొనారు.

వీధి దీపాలకు మరమ్మతు



చెన్నకేశ్వరస్వామి ఆలయం వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కాప్రా: వీధిదీపాలు, హైమాస్ట్ లైట్ల మరమ్మతులకు నోచుకోక కాప్రా డివిజన్‌లోని పలు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాకేత్‌కాలనీలో గత కొద్దిరోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని, స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయం కాప్రా కాలనీస్ కో– ఆర్డినేషన్ కమిటీ దృష్టికి రావడంతో సాకేత్‌కాలనీలో ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలగడం లేదనేది జాబితా తయారుచేసి సంబంధిత అధికారులకు వివరించారు. దీంతో స్పందించిన అధికారులు బుధవారం కాలనీలో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. కేసీసీ సభ్యులు మధుకర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్‌నాయక్, చెన్నకేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మల్లారెడ్డి, నరేందర్‌గౌడ్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టు సురేష్ సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ వాణీరెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టు మాదిరాజు సురేష్ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రశంసించారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఉప్పల్ సీనియర్ జర్నలిస్టు మాదిరాజు సురేష్‌కుమార్ సంస్మరణసభ ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, స్థానిక నేతలు శివారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ వాణీరెడ్డి, ఉప్పల్ డీసీ అంజనేయులు తదితరులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజేయూ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర కోశాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు బన్నాల ప్రవీణ్, సాయిజనేశేఖర్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య

మల్కాజిగిరి: అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఒకటోతరగతి నుంచి పదోతరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ మంచాల శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బెస్ట్ అవలెబుల్ స్కూల్‌గా పాఠశాలను గుర్తించిందన్నారు. దీనిద్వారా సెలెక్ట్ అయిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 9030476629.


ఆలయ హుండీ లెక్కింపు

రామంతాపూర్: నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయానికి చెందిన హుండీని బుధవారం కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 1,27,000 ఆదాయం వచ్చిందని, అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ఆలయ ప్రతినిధులు కొంపెల్లి ఉపేందర్, సురేష్, సేనాధిపతి బాలకృష్ణ తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

రామంతాపూర్ : నియోజకవర్గంలోని దేవాలయాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాలనీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన లూకాస్, అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన మధుబాబులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బోనాల పండుగకు అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను రెట్టింపు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, సలహాదారు నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, ఉపాధ్యక్షులు సునీల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పూర్ణ చంద్రారెడ్డి, రఘు, బాలు, ఇస్మాయిల్, సతీష్, వైస్ చైర్మన్‌గా నాగరాజు, కోశాధికారిగా వేణు తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం



మహేష్

కుషాయిగూడ: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ, శుభోదయకాలనీలో నివసించే తడక మహేష్ (31) ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 16న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం అతడి పెద్దనాన్న బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్‌లేని వాహనాలపై కఠిన చర్యలు

ఉప్పల్: ఫిట్‌నెస్‌లేని వాహనాలను రోడ్లపైకి తీసుకొస్తే సీజ్ చేస్తామని, మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఉప్పల్ పరిధిలో ఆర్టీఏ, ఉప్పల్ ట్రాఫిక్ సిబ్బందితో కలిసి స్కూల్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలు పాటించని డ్రైవర్లను ఉపేక్షించేది లేదని, అలాగే నిర్లక్ష్యం వహిస్తూ.. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో స్కూల్ పిల్లలను తీసుకెళ్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దైవ దర్శనాలకు ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ



కవిత, చెంగిచెర్ల డిపో మేనేజర్



మహేష్‌కుమార్, కుషాయిగూడ డిపో మేనేజర్

బోడుప్పల్: భక్తులకు దేవాలయాల దివ్య దర్శనాలు కల్పించేందుకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ ప్రవేశపెట్టిన ప్రత్యేక టూర్ ప్యాకేజీని భక్తులు వినియోగించుకోవాలని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత వివరించారు. బుధవారం చెంగిచర్లలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి చెంగిచర్ల డిపో నుంచి ఉప్పల్ చౌరస్తా మీదుగా ముచ్చింతల్‌లోని అనంత పద్మనాభస్వామి దేవాలయం, కొత్తూరు మీదుగా షాద్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, అమ్మపల్లిలోని వెండికొండ సిద్ధేశ్వరస్వామి దేవాలయం దివ్య దర్శనాలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని శివారు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 నుంచి 40 మంది ప్రయాణికులు కలిగి ఉండే దేవాలయాల దర్శనానికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.300లు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

విహారయాత్రకు స్పెషల్ బస్సు..

కాప్రా: వికారాబాద్ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు కుషాయిగూడ బస్ డిపో ఆధ్వర్యంలో స్పెషల్ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహేష్‌కుమార్ తెలిపారు. పచ్చని చెట్లు, చుట్టూ ఎత్తైన కొండలు, లోతైన వంపులతో చూడగానే మనస్సు మైమరచిపోయేలా ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండల అందాలను కుషాయిగూడ బస్ డిపో పరిసర ప్రాంత ప్రజలకు ఆస్వాదింపజేసేందుకు స్పెషల్ ప్యాకేజీతో ఈనెల 27న విహారయాత్ర పేరుతో మెట్రో డీలక్స్ స్పెషల్ బస్సును నడుపుతున్నట్లు డీఎం పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో అనంతగిరి కొండలతో పాటు కోటిపల్లి ప్రాజెక్టు, అనంత పద్మనాభస్వామి ఆలయం, బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు చిలుకూరు బాలాజీ టెంపుల్‌ను సందర్శించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ స్పెషల్ టూర్ ప్యాకేజీలో పెద్దలకు రూ. 600, పిల్లలకు రూ. 400గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ యాత్ర బస్సు ఈనెల 27న ఉదయం 5 గంటలకు ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి బయలుదేరి, ఎంజీబీఎస్ మీదుగా వికారాబాద్ జిల్లా చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని డిపో కోరారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో ప్రభాకర్‌గౌడ్

బోడుప్పల్: 2వ డివిజన్ పరిధిలోని హిమగిరికాలనీలో రూ. 20లక్షలతో సీసీరోడ్డు పనులకు బుధవారం బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో రోజులుగా రోడ్డు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ సహకారంతో పనులను చేపడుతున్నట్లు వివరించారు. మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, 3వ డివిజన్ ఇన్‌చార్జి యాదగిరి, సోషల్ మీడియా కో– ఆర్డినేటర్ గణేష్‌నాయక్, ఉమేష్‌చారి, కట్ట జగన్, హిమగిరికాలనీ అధ్యక్షులు అనీల్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌నాగరాజు, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, అఖిలాష్‌రెడ్డి ముఖ్యసలహాదారులు ఆచార్య పాల్గొన్నారు.

స్వచ్ఛతపై డ్రాయింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడిపల్లిలో జరిగిన స్వచ్ఛ్ పీర్జాదిగూడపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్వచ్ఛ్ పీర్జాదిగూడలో విద్యార్థులు సైతం పాలుపంచుకోవాలని, తడి,పొడిచెత్త వేరు చేసే విధానం, వీధి కుక్కల నియంత్రణ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులకు స్వచ్ఛతపై డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన, స్వచ్ఛతపై అవగాహన కల్పించేలా చిత్రాలు గీయడం, అనంతరం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ సిబ్బంది నాలాల్లో పూడికతీత, గ్రేడ్ లైసెన్స్ లేని షాపుల గుర్తింపు, భూ సర్వే, సూచిక బోర్డుల ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలను నిర్వహించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మౌలాలి: మౌలాలి డివిజన్‌లో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. బుధవారం హనుమాన్ శ్మశానవాటిక ముందు రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధిపథంలో నడిపిస్తున్నానని అంచెలంచెలుగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. శోభ, నర్మద, నర్సింగ్‌రావు, లత, వంశీరెడ్డి, పృథ్వీ, అభిషేక్, శరత్, సాయి, శివ, సాయిబాబా, మల్లారెడ్డి, శ్రీనివాస్, నటరాజ్, రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేసే వారికే గుర్తింపు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి నాయకుడికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం అల్వాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు టీఎస్.సంజీవ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో బలమైన పార్టీ నాయకులు ఉన్నారని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, భాస్కర్, కిట్టు, రఘు, శివ, వీనస్ మేరీ, పద్మ, నిర్మల, శకుంతలనాయుడు, సరోజ, గాయత్రి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



అధికారుల సమీక్షలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: జలమండలి అధికారులతో మల్లాపూర్ కార్పొరేటర్ పెండింగ్ పనులపై వార్డు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుభాష్ నగర్, బాబానగర్‌కాలనీ, నెహ్రూనగర్, అశోక్‌నగర్, మర్రిగూడ, ఓల్డ్ మల్లాపూర్, నాచారం బాబానగర్‌లో మంజూరైనా భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, కార్పొరేటర్ అధికారులకు సూచించారు. డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించాలని కోరారు. డ్రైనేజీ, సీవరేజ్‌లైన్ డీసిల్టింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సిరాజుద్దీన్, సూపర్‌వైజర్ నరేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

శానిటేషన్ డ్రైవ్‌తో సత్ఫలితాలు



రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని కామాక్షిపురం వివేక్‌నగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డ్రైవ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ గత కొద్ది రోజులుగా చేపట్టిన శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో డివిజన్‌లో మంచి ఫలితాలు వచ్చాయని, ప్రతి కాలనీలు పరిశుభ్రంగా మారాయన్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చింతూరు శ్రీనివాస్‌చారి, నారాయణదాసు, లింగం, రాజ్‌కుమార్, నరేందర్, అశోక్, రాజ్, బాబురావు తదితరులున్నారు.